క్లుప్తంగా

నేడు అగ్నిప్రమాదాల నివారణపై సమీక్ష

పరకాల : ఈ ఏడాది ఎండల తీవ్రత విపరీతంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో నేడు (సోమవారం) అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ టి.శేషాంజన్‌స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక కేంద్ర, పరకాల పోలీసుల శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యాసంస్థల, ఆస్పత్రుల, హోటళ్ల, వాణిజ్య సముదాయాల యాజమానులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, బట్టల దుకాణాదారులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి ప్రధానోపాధ్యాయుడు సర్వేశం, ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, పాషాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొమ్మన రాజు, ఆకుతోట రాజు, మల్లేష్, గువ్వ రాజు, రాణి, రహీమున్నీసా, అనిత తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' లీకేజీ షరా మామూలే



శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహ మూలమలుపు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడం షరామామూలే అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఆ ప్రదేశంలో పైపులైన్ జాయింట్ వద్ద లీకేజీ కావడంతో ఇప్పటికే 20 సార్లకుపైగా మరమ్మతు పనులు చేపట్టారు. తాజాగా ఆదివారం నాడు లీకేజీ ఏర్పడి నీటితో నిండిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భగీరథ పైప్‌లైన్ లీకేజీకి పకడ్బందీగా మరమ్మతు చేసి లీకేజీలు కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రచయిత కంధకట్ల జనార్దన్‌కు పురస్కారం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథపాలకుడు, ప్రముఖ రచయిత కందకట్ల జనార్దన్‌కు ఉగాది బహుభాషా కవి సమ్మేళనంలో పురస్కారం లభించింది. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో చింత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది బహుభాషా కవి సమ్మేళనంలో ఫౌండేషన్ చైర్మన్, ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, గాయకుడు, కవి మహమ్మద్ సిరాజోద్దీన్, బిల్లా మహేందర్, టీవీ.అశోక్, అనుమాండ్ల నాగరాజు చేతుల మీదుగా జనార్దన్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్‌ను ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఆర్ఎంపీల సాయం

నడికూడ : మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మహ్మద్ సాదిక్ పాషా తల్లి అనారోగ్యంతో శనివారం మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆర్ఎంపీలు రాజిరెడ్డి, రమేష్, శోభన్, సురేష్, రతీష్, సాగర్ రూ.5 వేలు సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

పరకాల : పరకాల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు (సోమవారం) స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ కె.జగన్నాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా ఇంట్రా మీ 20. ఇండికా కారు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పల్సర్, డిస్కవర్, హీరో సీడీ 100, స్ప్లెండర్, టీవీఎస్ ఎక్సెల్, గ్లామర్, హీరో హోండా, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ ప్లాటిన, టీవీఎస్ జూపిటర్, స్పోర్ట్స్ మొదలైన వాహనాలను వేలం వేస్తామని పేర్కొన్నారు. వరంగల్ రూరల్ డీపీఈఓ ఆర్.లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షిస్తారని, ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని వివరించారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు వేలంలో పాల్గొనాలని సీఐ కె.జగన్నాథరావు కోరారు.

బియ్యం అందజేత

ఎల్కతుర్తి: మండల కేంద్రానికి చెందిన ఎంజాల రామస్వామి ఇటీవలే మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బీజేపీ రాష్ట్ర నేత, హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు ఆదివారం 50 కిలోల బియ్యం అందజేశారు.

బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయి



మహదేవపూర్ : రాస్తారోకో చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

మహదేవపూర్: దేశంలో నియంతపాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజల చేతిలో గుణపాఠం పొందే రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడంపై నిరసిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం నియంత పాలన కొనసాగిస్తుందని, ప్రజల తరుపున పోరాటం చేస్తే అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ సెల్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

చిట్యాల: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై అక్రమంగా కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుమార్ విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో ఆదివారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మోదీ, కేసీఆర్ ఇద్దరూ ఫ్యూడలిస్ట్ విధానాలను అవలంబిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వారు విమర్శించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు సర్వ శరత్, నాగరాజు, శ్రీకాంత్, రవీందర్, శ్రీకాంత్, వినయ్, శ్రీనాథ్, రాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ముస్తాబవుతున్న రామాలయాలు



రంగులతో ముస్తాబవుతున్న ఏటూరునాగారం రామాలయం



భద్రాచలం నుంచి తలంబ్రాల బియ్యాన్ని స్వీకరిస్తున్న చైర్మన్ రమేష్

- 30న సీతారాముల కల్యాణం

ఏటూరునాగారం: సీతారాముల కల్యాణానికి రామాలయాలు ముస్తాబు అవుతున్నాయి. స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి, రొయ్యూర్, రామన్నగూడెం తదితర ప్రాంతాల్లోని రామాలయాలను కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటూరునాగారంలో ఈనెల 30న సీతాదేవి రాముడికి కల్యాణం మధ్యాహ్నం 12 గంటల 5 నిమిషాలకు జరుపనున్నట్లు ఆలయ అర్చకులు యల్లప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ తెలిపారు. 29న ఎదురుకోలు, 31న నిత్యారాదన, హోమము, దొంగలదోపు, ఏప్రిల్ 1న పూర్ణాహుతి, ఆరగింపు, తీర్థప్రసాదాల వినియోగం, అదేరోజు రాత్రి 9.30 లకు పుష్పయాగం(నాగబలి) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 2న ఊరేగింపు, వసంతోత్సవం ఉంటుందన్నారు.

భద్రాచలం నుంచి తలంబ్రాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం పుణ్యక్షేత్రం నుంచి ఏటూరునాగారం రామాలయానికి ప్రత్యేకించి తలంబ్రాలను తెప్పించారు. ఆ తలంబ్రాలతో కల్యాణాన్ని జరిపించనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక ఏర్పాట్లు

కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వస్తున్న భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. తాటి ఆకులతో చలువపందిళ్లు, క్యూలైన్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలీసుల సహకారం కూడా తీసుకుంటాం.

– మోడెం రమేష్, రామాలయం కమిటీ చైర్మన్, ఏటూరునాగారం

ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

మహాముత్తారం: ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. 2016 కంటే ముందు ఆధార్ తీసుకున్న ప్రతి ఒక్కరూ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డ్ అప్‌డేట్ సెంటర్‌ను మండలంలోని బోర్లగూడెంలో సోమవారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం బ్యాంకు పాస్‌బుక్, ఓటర్ ఐడీ, పాన్, రేషన్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమోలో ఏదో ఒకటి తీసుకుని రావాలని సూచించారు. అప్‌డేట్ కోసం రూ.50 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పరిహారం అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న అశోక్

కాటారం: మండలంలోని శంకరాంపల్లి గ్రామానికి చెందిన పర్వవేణ గట్టయ్య గేదె కొన్ని నెలల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. కాగా టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా రూ.40వేల నష్టపరిహారం మంజూరైంది. ఆదివారం సర్పంచ్ అంగజాల అశోక్, ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ ఉపేందర్ బాధితుడు గట్టయ్యకు చెక్కును అందజేశారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామాన్ని నూతనపంచాయితీగా ఏర్పాటు చేయాలని పంచాయితీ సాధన సమితి మహిళా అధ్యక్షురాలు ఇరుప విజయ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ నూతన పంచాయతీ ఏర్పాటుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన సమయంలో దరఖాస్తు చేయగా గిరిజనేతరులు ఉద్దేశ్యపూర్వకంగా రద్దు చేయించారన్నారు. గ్రామంలో ఎస్సీ ఎస్టీ, బీసీ సుమారు 900 మంది ఓటర్లు ఉన్నారని నూతన జీపీ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయని అన్నా రు. కార్యక్రమంలో రసపుత్ గిరి, బుర్రి సాంబయ్య, విజయ, వెన్నెల, రాజమ్మ, శాంతమ్మ, శ్రావణ్, శ్రీకాంత్, రతన్, సంతోష్, విజయ్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ

మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేస్తా

ములుగు : మున్నూరు కాపుల అభివృద్ధికి ఐక్యతకు కృషి చేస్తానని మున్నూరుకాపు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం ఆవరణలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింత నిప్పుల భిక్షపతి, కార్యదర్శిగా ఎడ్ల సంపత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సముద్రాల రఘోత్తం, సంయుక్త కార్యదర్శిగా సూర రఘు, కోశాధికారిగా గాదె రాజు, ఆడిటర్‌గా సత్తు రఘునాథంతో పాటు ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

సీఆర్పీల వేతనాల్లో గోల్‌మాల్

- పని చేసినోళ్లకు శాపాలు.... చేయనోళ్లకు జీతాలు
- బీఆర్సీ ఏపీఎం, నాన్‌పామ్ డీపీఎం సూత్రదారులు
- వాటాలుగా పంపకాలు జరిగినట్లు గుసగుసలు



కన్నాయిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళా సంఘ సభ్యులతో వారిని ఆర్థికంగా రాణించి వ్యాపారవేత్తలుగా తయారు చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా ఎస్‌వీఈపీ ప్రాజెక్టును 2016 సంవత్సంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు జిల్లా నాలుగు మండలాలైన ఏటూరునాగారం,మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెంను కలుపుకొని బీఆర్సీబ్లాక్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని బిజినేపల్లిలో మరో మూడు మండలాలతో రాష్ట్రంలో రెండు బ్లాక్ రీసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి ఏడు మండలాల్లో ప్రాజెక్టును ప్రారంభించారు. మండలానికి నలుగురు సీఆర్పీ ఈపీలను రిక్రూట్‌మెంట్ చేసుకొని 2016 నుంచి 2021 వరకు ప్రాజెక్టును కొనసాగించారు. కొన్ని కారణాలతో కొంత మంది సీఆర్పీ ఈపీలు మధ్యలోనే వెళ్లిపోయారు. వారిస్థానంలో 2019లో మళ్లీ రిక్రూట్ చేసుకొని వారి సేవలను వినియోగించుకున్నారు. నెలనెలా వేతనాలు ఇచ్చినప్పటికీ వీరి వేతనాల ఫైల్ బీఆర్సీ ఏపీఎం, నాన్ పామ్ డీపీఎం తయారుచేస్తారు. కానీ 2019 నుంచి 2021 మార్చి వరకు బడ్జెట్ లేకపోవడంతో సీఆర్పీల వేతనాలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి వేతనాలు రాలేదు. దీనికి సంబంధించి డీఆర్‌డీఏ నుంచి సెర్ఫ్‌కు రెక్వెస్ట్‌లెటర్ పెట్టగా 2022న బడ్జెట్ రావడంతో ఫైల్‌ను బీఆర్సీ ఏపీఎం, నాన్‌పామ్ డీపీఎం తయారు చేసి 60 శాతం జీతాలు సెప్టెంబర్‌లో, 40 డిసెంబర్‌లో విడుదల చేశారు. కానీ జీతాల ఫైల్ ఆలస్యంగా బయటకు రావడంతో అసలు విషయం బయటికొచ్చింది. అందులో శ్వేత సీఆర్పీ ఈపీ మధ్యలోనే బంద్ చేయగా ఆమెకు పూర్తి జీతం చేసినట్లు, కన్నాయిగూడెం మండలానికి చెందిన మల్లేష్ సీఆర్పీకి 4 నెలల జీతం, దుర్గం రాజుకు మే నెల వేతనంలో కోతలు విధించారు. దీంతో పని చేసిన వారికి కాదని చేయని వారికి జీతాలు చేయడంలో ఆంతర్యం ఏమిటని సీఆర్పీ ఈపీలు చర్చించుకుంటున్నారు. సీఆర్పీ ఈపీల వేతనాల్లో జరిగిన అవకతవకలపై ఉన్నతధికారులతో సమగ్ర విచారణ జరిపి సంబంధిత సీఆర్పీలకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయపై సంబంధిత నాన్ పామ్ ఏపీఎంను ఫోన్‌లో వివరణ కోరగా జీతాల ఫైల్ నేను చేయలేదన్నారు. అప్పుడు పని చేసిన మెంటర్‌ను ఫోన్‌లో మా జీతాలు చేయడంలేదంటూ అడగగా మీకు జీతాలు రావల్సింది నిజమే, ప్రస్తుతం నేను అక్కడ లేను కాబట్టి ఉన్నవాళ్లు చేయాలే ఎందుకు చేయడం లేదు. మరి శ్వేత మధ్యలోనే మానేసింది అమెకు పూర్తి జీతం ఎలా చేశారంటూ సమధానం ఇచ్చారు. ఉన్నతధికారులు విచారణ జరిపితే నిజానిజాలు బయటపడుతాయి.

విద్యార్థినులకు ఆత్మరక్షణ ముఖ్యం



బెల్టులను అందజేసిన సీఐ రాజు

ఏటూరునాగారం: చదువుకునే విద్యార్థులకు ఆత్మరక్షణ ముఖ్యమని, దీని కోసం ప్రతి ఒక్కరూ కరాటేలో శిక్షణ పొందాలని స్థానిక సీఐ రాజు అన్నారు. ఆదివారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నెల రోజుల పాటు జరిగిన కరాటే శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి సీఐ హాజరై బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కరాటే శిక్షణతో మనోధైర్యం, మానసిక వికాసం లభిస్తోందన్నారు. ఎలాంటి ఆకర్షణలకు గురికాకుండా జీవితంలో మంచి ఉద్యోగం పొందాలన్నారు. 19 మందికి ఎల్లో, 10 మందికి ఆరేంజ్ బెల్ట్స్ మందికి సీఐ అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ పీవై లక్ష్మి, కరాటే మాస్టర్ అబ్బు, పీఈటీ స్వరూప పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



ములుగు రూరల్: యు వకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని మల్లంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో మదర్‌సా ఉర్దూ మీడియం పాఠశాలలో హన్మకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన మహ్మద్ జాహిద్(24) ప్రైవేటు టీచర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 22న పాఠశాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మల్లంపల్లిలో మిత్రుడిని కలిసి హన్మకొండకు బయలుదేరాడు. పాఠశాల నుంచి బయలుదేరిన తమ్ముడు ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేసి చూడగా స్విచ్ ఆఫ్ వస్తుందని తెలిపాడు. బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో జాహిద్ అన్న హఫీజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మల్హర్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని తాడిచర్లకు చెందిన రాయమల్లుకు రూ.16వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. బీఆర్ఎస్ నాయకులు ఆదివారం లబ్ధిదారుడికి చెక్కును అందజేశారు. అనంతరం కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి బండి రాజయ్య కుమార్తె ప్రథమ వర్ధంతికి వారు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరీ హరీష్, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య, తాడిచర్ల గ్రామశాఖ అధ్యక్షుడు మధుసూదన్ రావు, సాంబయ్య, రాజు, సత్యనారాయణ, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

గీతకార్మికుడికి ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన గుర్రపు గట్టయ్య గత కొన్ని రోజుల క్రితం తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిన సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని వరంగల్ ఆస్పత్రికి పంపించగా పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. డాక్టర్లు సర్జరీ చేయడానికి రూ.5 లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన గట్టయ్యను ఆదుకోవాలని కోరుతూ గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కోరారు. స్పందించిన మంత్రి వెంటనే రూ. 5 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయగా బాధిత కుటుంబానికి అందించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ గోపి గౌడ్, రవీందర్ గౌడ్, రమేష్, రాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాళేశ్వరం: మండలంలోని కాళేశ్వరంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లేతకారి సదువలి, అధ్యక్షుడిగా శనివారం గణపతి, ఉపాధ్యక్షుడిగా రేనుకుంట్ల తిరుపతి, కార్యదర్శిగా చకినారపు ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా చకినారపు రాజయ్య, కోశాధికారిగా చకినారపు అశోక్, ప్రచార కార్యదర్శిగా రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ ఏప్రిల్ 4న తెలుగు రాష్ట్రాల్లో జాతీయ రహదారుల దిగ్బంధం చేయడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు లేతకారి రాజయ్య, బెల్లంపల్లి రాజయ్య, మంథని రవితేజ, తిరుపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఉమేష్‌గౌడ్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రావులపల్లికి చెందిన ముదురోళ్ల సారమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోడెం ఉమేష్‌గౌడ్ పరామర్శించి రూ.2వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు పీఏ సీఎస్ వైస్ చైర్మన్ సామల పాపరెడ్డి, మైస భిక్షపతి, మ్యాకల శంకర్, రాజు, తాజొద్దీన్, నరేష్, లింగయ్య, పోశాలు, జయపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, కుమార్, గణేష్, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం



క్రీడాకారుడికి నగదు అందజేస్తున్న సీఐ రాజు

ఏటూరునాగారం: మంగపేట మండలం బోరునర్సాపురం గ్రామానికి చెందిన సాదనపల్లి శ్రీహరి భద్రాద్రి కొత్తగూడెం–మణుగూరు మిట్టగూడ ప్రభుత్వ గురుకుల కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. కాకతీయ యూనివర్సిటీ తరపున నేషనల్ ఆల్ ఇండియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఒడిషాలో ఆడేందుకు అవకాశం వచ్చింది. క్రీడాకారుడికి అక్కడికి వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేక పలువురు స్నేహితులకు తెలుపగా సోషల్‌మీడియాలో చూసిన ఏటూరునాగారం సీఐ రాజు స్పందించి రక్తనిధి డోనర్స్ ద్వారా రూ. 6 వేల నగదును శ్రీహరికి అందజేశారు. కార్యక్రమంలో వహీద్, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

'మోడల్'లో వార్డెన్లను నియమించాలి



మాట్లాడుతున్న బాలేశ్వర్

ములుగు రూరల్ : మోడల్ హాస్టల్‌లో వార్డెన్లను నియమించాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు బాలేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో వార్డెన్లు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సుమంత్, రవితేజ, స్వామి, శివకేశవ్, సుమన్ పాల్గొన్నారు.